
www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
బుధవారం | 22 | జూలై | 2026
పేజీలు : 8

## తహసీల్దార్‌తో పాటు ఇద్దరు ఆర్ఐలు బదిలీ





ప్రజాపక్షం కథనానికి అధికారుల స్పందన

-ప్రజాపక్షానికి రైతుల కృతజ్ఞతల వెల్లువ

2లో

# మత్తుకు బానిసవుతున్న యువత..!



-పెరిగిన గంజాయి వినియోగం..

మద్యం విక్రయాలు

-తలెత్తుకోలేక తల్లిదండ్రులు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** గంజాయి వాడకం రోజు రోజుకు పెరుగుతుంది. గంజాయి మాత్రమే పట్టుబడుతున్న తరుణంలోనే గంజాయి మత్తులో జోగుతున్న యువకులను సైతం పోలీసులు గుర్తించి తగు చర్యలు తీసుకోవడం, పట్టణాలకే పరిమితం అనుకున్న గంజాయి వినియోగం ఇప్పుడు పల్లెలకు పాకడం ఆందోళన కలిగించే విషయం. మారిన పరిస్థితులు, పెరిగిన నిరుద్యోగం, కరువైన ఉపాధి, సోషల్ మీడియా ప్రభావం యువతపై తీవ్ర ప్రభావం చూపుతుంది. గాడి తప్పిన యువత అక్రమ మార్గాల వైపు అడుగులు వేస్తూ కొందరు అరాచక శక్తులుగా మారుతున్నారు. ఈజీ మనీ పేరుతో ఏది చేసేందుకైనా వెనుకడటం లేదు. డబ్బు కోసం దౌర్జన్యానికి పాల్పడటం, దాడులు, కిడ్నాప్‌లు చేయడం ఆ డబ్బుతో మద్యం, గంజాయి వంటివి సేవిస్తున్నారు. గంజాయి రవాణా ద్వారా అతి కొద్ది సమయంలో పెద్ద మొత్తంలో డబ్బు సంపాదించవచ్చునన్న ఆలోచనతో తమ జీవితాలను వ్యర్థం చేసుకుంటున్నారు. జైళ్లలో మగ్గుతున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న యువకుడు సంపాదనపై ఆశతో గంజాయి రవాణాకు అంగీకరించి తొలి రోజే పోలీసులకు దొరికిపోయాడు.ఈ విషయం తెలిసి తండ్రి మనోవేదనతో మరణించాడు. ఇప్పుడు అతని పరిస్థితి దుర్భరంగా మారింది. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. నగరాలు, పట్టణాల శివార్లు, నిర్మానుష్య ప్రాంతాలు

మిగతా 2లో..

## ప్రజలను విస్మరిస్తున్న పాలకులు




2లో

-ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటాలు

-సిపిఐ ప్రజా సంఘాల సమావేశంలో బాగం

## 'సర్' ప్రక్రియలో భాగస్వాములు కండి

- ప్రజా స్వామ్యంలో ఓటుహక్కు అత్యంత ప్రాధాన్యం

- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా



2లో..

ఆయిల్ పామ్ సాగు

## రైతుల ఆర్థిక స్థిరత్వానికి బలమైన పునాది



-ములకలపల్లిలో పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటు

-గిరిజన కుటుంబాల ఆదాయం పెరిగితేనే పిల్లల భవిష్యత్తు ఉజ్వలం

-ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు అందించడమే లక్ష్యం : మంత్రి తుమ్మల

**ప్రజాపక్షం/ములకలపల్లి:** ఆయిల్ పామ్ సాగు రైతుల ఆర్థిక స్థిరత్వానికి బలమైన పునాదిగా నిలుస్తుందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో పంటల మార్పిడే రైతులకు సరైన ప్రత్యామ్నాయమని సూచించారు. ములకలపల్లి మండలంలో మంగళవారం నిర్వహించిన ఆయిల్ పామ్ రైతుల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి తుమ్మల



నాగేశ్వరరావు జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయిల్ పామ్ సాగు విస్తరణ, ప్రత్యామ్నాయ పంటలు, నీటి సంరక్షణ, గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల అభివృద్ధికి

మిగతా 2లో..

# మత్తుకు బానిసవుతున్న యువత..!

(మొదటిపేజీ తరువాయి)
గంజాయి అడ్డాలుగా మారుతున్నాయి. ఇప్పుడు గంజాయి సిగరెట్ల వాడకం ఫ్యాషన్‌గా మారింది. గంజాయి పరిస్థితి ఈవిధంగా ఉంటే మద్యం విక్రయాలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. మద్యం సేవిస్తున్న వారిలో యువత ఎక్కువగా ఉండటం గమనార్హం. మత్తుకు బానిసైన యువత తమ జీవితాలను ఛిద్రం చేసుకోవడంతో పాటు వైవాహిక జీవితాలకు దూరమవుతున్నారు. జీవితంలో స్థిరత్వం లేకపోవడం, సంపాదన మార్గాలు మూసుకుపోవడంతో వైవాహిక జీవితం పట్ల విరక్తి ప్రదర్శిస్తూ ఒంటరి జీవితానికి మొగ్గు చూపుతున్నారు. కండ్ల ముందే దారి తప్పిన పిల్లలను చూసి సమాజంలో తలెత్తుకోలేక తమ నివాసాలను మారుస్తూ పరిచయాలు లేని ప్రాంతాలకు వలస పోతున్నారు. మీ వాడి పరిస్థితి ఏమిటని అడుగుతారేమోనని ముఖం చాటేస్తున్నారు. దారి తప్పిన వారిలో కేవలం యువకులే కాదు యువతులు చేరుతుండటం శోచనీయం. స్వేచ్ఛ పేరున పెరిగిన విశృంఖలత ఈ పరిణామాలకు దారి తీస్తుంది. గంజాయి మొదలైన నిషేధిత మత్తు పదార్థాలను అరికట్టేందుకు పోలీసులు తమదైన పద్ధతుల్లో ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. మత్తుతో పాటు కొందరు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. సామాజిక పరివర్తన క్రమంలో వచ్చిన మార్పు నుంచి యువత బయటపడాలి. యువజన విద్యార్థి సంఘాలు, స్వచ్ఛంద, రాజకీయ పార్టీల అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో విరివిరిగా అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలి. తల్లిదండ్రులు ఎక్కడో చదువుతున్నాడు వాడికేం అన్న భావన నుంచి బయటపడి పిల్లల దైనందిన కార్యక్రమాలపై నిరంతరం నిఘా ఉంచాలి. పాలకులు ఉద్యోగ, ఉపాధి కల్పన రంగాలపై దృష్టిసారించాలి. మద్యం, గంజాయితో పాటు ఆన్‌లైన్ ఆటలతో లక్షలాది రూపాయలు పోగొట్టుకుని అప్పులు తీర్చే మార్గం కానరాక ప్రాణాలు తీసుకుంటున్నారు. సెల్ ఫోన్ వినియోగం అవసరానికి గాక వ్యసనంగా మారింది. ఈ వ్యసనం చివరికి జీవితాల్లో చిచ్చుపెడుతుంది. పెండ్లిళ్ల పెటాకులవుతున్నాయి. శాస్త్ర సాంకేతిక రంగాల్లో వచ్చిన మార్పును ఎదుగుదలకు, సత్వర సమాచారానికి, మెరుగైన జీవన విధానానికి వాడుకోవాలి కానీ శృతిమించిన వాడకం ఇటువంటి పరిణామాలకే దారి తీస్తుంది.

## ఆయిల్ పామ్ సాగు

# రైతుల ఆర్థిక స్థిరత్వానికి బలమైన పునాది

(మొదటిపేజీ తరువాయి)
ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రహదారులు, తాగునీరు, విద్యుత్, వైద్యం వంటి మౌలిక సదుపాయాలతో పాటు గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు గురుకులాలు, ఏకలవ్య పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గిరిజన పిల్లలు ఉన్నత చదువులు అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. జిల్లాలో సూపర్ ఎల్‌నినో ప్రభావంతో ఇప్పటికే వర్షపాతం లోటు నమోదైందని, రానున్న నెలల్లో కూడా వర్షాలు తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున బోర్లపై ఆధారపడి అధిక నీటి అవసరమున్న వరి సాగు చేయకుండా రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ములకలపల్లి మండలంలో ప్రస్తుతం 8వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని, మరో 10వేల ఎకరాల్లో సాగు విస్తరిస్తే ఈ ప్రాంతంలో పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. నీటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి రైతు తన పొలంలో ఫామ్ పాండ్ నిర్మించుకుని వర్షపు నీటిని నిల్వ చేసుకోవాలని తెలిపారు. దీని వల్ల భూగర్భజలాలు పెరిగి భవిష్యత్తులో వ్యవసాయానికి ఉపయోగపడతాయని చెప్పారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు గోదావరి జలాలు అందించడమే తమ జీవిత లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగులో ముందంజలో ఉందన్నారు. జిల్లాలో ప్రస్తుతం



90వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని, ఈ ఏడాది కొత్తగా 15వేల ఎకరాల్లో సాగు లక్ష్యం పెట్టుకున్నామని తెలిపారు. ఆయిల్ పామ్ నాలుగో సంవత్సరం నుంచి దిగుబడి ప్రారంభించి సుమారు 30 సంవత్సరాల పాటు రైతులకు స్థిరమైన ఆదాయం అందించే పంటగా నిలుస్తుందని చెప్పారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల సమన్వయంతో కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నామని వివరించారు. ఈసందర్భంగా మంత్రి, కలెక్టర్ రైతులకు రాయితీపై కంది, మినుము విత్తనాలను పంపిణీ చేశారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, ఆయిల్ పామ్ సంస్థ ప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజలను విస్మరిస్తున్న పాలకులు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** కేంద్ర, రాష్ట్ర పాలకులు ప్రజలను విస్మరించి పాలన సాగిస్తున్నారని, సామాన్యుల కంటే కార్పొరేట్ శక్తుల పట్ల సానుకూలత ప్రదర్శిస్తున్నారని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ఆరోపించారు. మోడీ సర్కార్ ప్రజల గురించి ఆలోచించడం లేదని పేద, మధ్యతరగతి ప్రజలు బతకలేని స్థితికి ప్రభుత్వ చర్యలు నెట్టివేస్తున్నాయన్నారు. సిపిఐ ప్రజా సంఘాల సంయుక్త సమావేశం మంగళవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. బిజి క్లైమెంట్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాగం హేమంతరావు మాట్లాడుతూ వ్యవసాయ రంగ సబ్సిడీలను ఎత్తివేసి వ్యవసాయ రంగాన్ని సైతం కార్పొరేట్ పరిధిలోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తుందన్నారు. రసాయనిక ఎరువులపై సబ్సిడీ ఎత్తివేత, ఇతర దేశాల నుంచి జీరో ట్యాక్స్‌తో వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతి కార్పొరేటీకరణలో భాగంగానే జరుగుతున్నాయని ఆయన తెలిపారు. అంబానీ, అదానీ తప్ప వేరే సమూహాల గురించి ప్రభుత్వం ఆలోచించడం లేదని వారి కనుసన్నల్లోనే ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసి విబి జీ రాం జీ పథకాన్ని తీసుకు వచ్చారని అదే క్రమంలో నాలుగు లేబర్ కోడ్‌ను అమల్లోకి తెచ్చారని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో కూడా ప్రజలకు ఇచ్చిన హామీల గురించి పట్టించుకోవడం లేదని హేమంతరావు తెలిపారు. పంటల బీమా పథకాన్ని అమలు చేయడంతో పాటు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని హేమంతరావు డిమాండ్ చేశారు. ఆగస్టు ఆరు నుంచి 15 వరకు ఖమ్మం జిల్లాలో పాదయాత్ర నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. పాదయాత్రకు సంబంధించిన ఏర్పాట్లపై ప్రజా సంఘాల సమావేశంలో సమీక్షించారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్ధినేని కర్ణకుమార్, మహ్మద్ సలాం, అజ్మీర రామ్మూర్తి పాల్గొన్నారు.

# మూడు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



**ప్రజాపక్షం/అశ్వాపురం :** అశ్వాపురం మండలం మిట్టగూడెం 40 ఎంఎల్‌డీ నీటి శుద్ధి కేంద్రం(రధం గుట్ట)లో పని చేస్తున్న కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం గేటు ముందు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గద్దల శ్రీనివాస్ మాట్లాడుతూ రిషి కాంట్రాక్టర్ గత మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లిస్తామని హామీ ఇచ్చి కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. సమస్యపై పలుమార్లు అధికారులకు వినతులు ఇచ్చినా స్పందన లేదని విమర్శించారు. పెండింగ్ వేతనాలు, ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, లేనిపక్షంలో దశలవారీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ధర్నాలో పాయం నాగరాజు, ఇరపా లక్ష్మణ్, బి సతీష్, ఎ ప్రభాకర్, పి సుజాత, పి జ్యోతి, జె నాగమణి, తదితర కార్మికులు పాల్గొన్నారు.

## తహసీల్దార్‌తో పాటు ఇద్దరు ఆర్ఐలు బదిలీ

**ప్రజాపక్షం/బోనకల్:** భూ లావాదేవీలకు సంబంధించి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న రెవెన్యూ అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ''వారసత్వానికి తూట్లు.. భూ భారతికి వక్రభాష్యం'' అనే శీర్షికతో ప్రజాపక్షం దినపత్రిక సోమవారం ప్రచురించిన ప్రత్యేక కథనంపై స్పందించిన ఉన్నతాధికారులు ప్రాథమిక విచారణ చేపట్టారు. విచారణలో ప్రజాపక్షం కథనంలో పేర్కొన్న అంశాలు వాస్తవమేనని ప్రాథమికంగా తేలడంతో బోనకల్ మండల తహసీల్దార్‌తో పాటు ఇద్దరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లపై బదిలీ వేటు వేశారు. తహసీల్దార్ సుధాకర్‌ను కల్లూరు సబ్ కలెక్టర్ కార్యాలయానికి, ఆర్ఐ 1 మైథిలిని కూసుమంచి మండలానికి, ఆర్ఐ 2ను ఎన్కూర్ మండలానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీలతో బోనకల్ మండల రెవెన్యూ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రజాపక్షం వెలుగులోకి తీసుకువచ్చిన కథనానికి విశేష స్పందన లభించగా, భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న పలువురు బాధిత రైతులు పెద్ద సంఖ్యలో ఫోన్ చేసి ప్రజాపక్షంకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

## 'సర్' ప్రక్రియలో భాగస్వాములు కండి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రతీ ఒక్కరూ ప్రత్యేక దృష్టి సారించి అర్హులందరికీ ఓటు హక్కు అందేలా చూడాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా పిలుపునిచ్చారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా కార్యకర్తలు ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించేందుకు సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో లక్ష్మీ దేవిపల్లి మండల పరిధిలోని లోతువాగు గ్రామంలో మంగళవారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిథిగా హాజరైన పాషా మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు అత్యంత కీలకమైందని, ప్రజాప్రతినిధులను ఎన్నుకునే శక్తి కేవలం ఓటుకే ఉందన్నారు. 18సం. నిండిన ప్రతీ ఒక్కరికీ ఓటు నమోదు చేయించే బాధ్యత స్థానిక శ్రేణులదే అన్నారు. ప్రధానంగా పార్టీ తరఫున నియమితులైన బిఎల్‌ఏలు ఎప్పటికప్పుడు ఓటర్ జాబితాలను పరిశీలించి లోపాలను సవరించాలన్నారు. జాబితాలో తప్పులు సరిదిద్దడం, కొత్తఓటర్ల చేర్పులు, మరణించిన వారి పేర్లు తొలగింపు అంశాల్లో బిఎల్ఓలు, పార్టీ శ్రేణులు కలిసికట్టుగా క్రియాశీలకంగా వ్యవహరించాలన్నారు. ఎన్నికల అధికారులకు క్షేత్రస్థాయిలో పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంలో ఓటర్ల భాగస్వామ్యం ఎంతో అవసరమని ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా జాబితా తయారీకి సహకరించాలని ఆయన కోరారు.

## రాష్ట్ర ఆర్యవైశ్య రాజకీయ కమిటీ కార్యదర్శిగా కిషోర్



**ప్రజాపక్షం/సుజాతనగర్:** సుజాతనగర్ మండలానికి చెందిన సిపిఐ పార్టీ టౌన్ జాయింట్ సెక్రెటరీ కిషోర్ తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాజకీయ కమిటీ కార్యదర్శిగా నియామకమయ్యారు. ఈ మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు ధారా రమేష్ మంగళవారం చిట్టూరి కిషోర్ కి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచిన బాధ్యతను ఆర్యవైశ్య కులాన్ని అభివృద్ధి చెందేలా కృషి చేస్తానని అన్నారు. ఈ పదవి రావడానికి కృషి చేసినటువంటి జిల్లా అధ్యక్షులు ధారా రమేష్ కృతజ్ఞతలు తెలిపారు.

## పోడు రైతులకు అండగా ఉంటా..అధైర్యపడొద్దు

-ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/అశ్వాపురం:** పోడు రైతులు, గిరిజనుల హక్కుల పరిరక్షణకు అండగా ఉంటానని పినపాక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు భరోసా ఇచ్చారు. అశ్వాపురం మండలం వేములూరు, మనుబోతుల పాడు గ్రామాల్లో ఇటీవల ఘటనల్లో గాయపడిన పోడు రైతులు, గిరిజనులను ఎంఎల్ఏ మంగళవారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు. మనుబోతులపాడు ఘటనలో గిరిజనులపై అటవీశాఖ అధికారుల దాడిని ఎంఎల్ఏ తీవ్రంగా ఖండించారు. బాధ్యులపై ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టిందని, అక్రమంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోడు భూముల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తానని, రైతులు అధైర్యపడవద్దని సూచించారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు, సర్పంచులు, ఉప సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## బెల్ట్ షాపులపై ఎక్సైజ్ దాడులు

-13 మందిపై బైండోవర్ కేసులు

**ప్రజాపక్షం/ఏన్కూరు:** ఏన్కూరులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్ట్ షాపులపై ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా 13 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసి తహసీల్దార్ సిహెచ్ శేషగిరిరావు ఎదుట హాజరుపరిచారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ వసంత లక్ష్మి, సిబ్బంది వీరభద్రం, సతీష్ పాల్గొన్నారు.

## చీమలపాడు సబ్ సెంటర్‌లో గర్భిణులకు వైద్య శిబిరం

**ప్రజాపక్షం/కారేపల్లి:** చీమలపాడు ఉప ఆరోగ్య కేంద్రంలో గర్భిణీ స్త్రీల ప్రసవ పూర్వ పరీక్షల(ఏఎన్‌సీ)వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో గర్భిణీలకు రక్తపోటు, బరువు, హిమోగ్లోబిన్ వంటి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సమతుల్య ఆహారం, ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రల వినియోగం, గర్భధారణ జాగ్రత్తలు, ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ నరసింహారావు, ఎంఎల్‌హెచ్‌పిలు కళ్యాణి, సంధ్య, మహాలక్ష్మి, ఏఎన్ఎంలు నాగమణి, సునీత, ఉషారాణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు

**-బ్లాక్ స్పాట్లలో శాశ్వత పరిష్కారం**
**-రవాణా శాఖ కమిషనర్ వీసీలో పాల్గొన్న కలెక్టర్, సిపి**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు, ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టి జాతీయ రహదారులపై రోడ్డు భద్రతా ప్రమాణాలు పూర్తి స్థాయిలో అమలు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులతో జాతీయ రహదారులపై రోడ్డు భద్రతా చర్యలు, ప్రమాదాల నివారణ, సుప్రీం కోర్టు మార్గదర్శకాల అమలు, అనుసరణ, నివేదికల సమర్పణ ప్రమాదాల తగ్గింపుకు తీసుకోవాల్సిన చర్యలు, జాతీయ రహదారుల వెంట ఉన్న ఆసుపత్రుల మ్యాపింగ్, ఆక్రమణల తొలగింపు, అత్యవసర స్పందన వ్యవస్థ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లా అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కలెక్టరేట్ నుండి కలెక్టర్ దివాకర టిఎస్, ఖమ్మం పోలీస్ కమిషనరేట్ నుండి సిపి సునీల్ దత్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.వీసీ అనంతరం సంబంధిత శాఖలతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను, ఇప్పటికే గుర్తించనవి, ఆయా ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. మున్సిపల్ ప్రాంతాల్లోని ప్రధాన రహదారులు, క్రిటికల్ జంక్షన్లలో అవసరమైన రోడ్డు భద్రత పనులను తక్షణమే చేపట్టాలన్నారు. జాతీయ రహదారుల వెంట వాహనాల కోసం అవసరమైన పార్కింగ్ ప్రాంతాలు, 50 కిలో మీటర్ల పరిధిలో ప్రజలకు అవసరమైన పార్కింగ్, మరుగుదొడ్లు, ఇతర సదుపాయాలతో నివేదిక సమర్పించాలన్నారు. పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుని ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని, ఆధునీక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ట్రాఫిక్ ఉల్లఘనను నమోదు చేయాలన్నారు. జాతీయ రహదారిపై ఉన్న ఆక్రమణలను గుర్తించి తొలగించాలన్నారు. బ్లాక్ స్పాట్లను శాశ్వతంగా సరి దిద్దేందుకు అందుబాటులో ఉన్న నిధులను పూర్తి స్థాయిలో వినియోగించాలన్నారు. ప్రతి నెల మూడవ శుక్రవారం జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశాన్ని నిర్వహించి సమీక్షించాలన్నారు.ఈ సమావేశంలో ఆర్అండ్‌బి ఎస్ఈ యుగంధర్‌రావు, డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రామారావు, నేషనల్ హైవే పిడి దివ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# యువతను మై భారత్ పోర్టల్‌లో నమోదు చేయాలి


**-వికసిత్ భారత్, ముక్త్ భారత్‌లో యువతను భాగస్వామ్యం చేయాలి : అదనపు కలెక్టర్ పి. శ్రీజ**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రతి విద్యా సంస్థలోని యువతను మై భారత్ పోర్టల్‌లో నమోదు చేయాలని అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం యువత కోసం ప్రారంభించిన మై భారత్ పోర్టల్ ద్వారా అందుబాటులో ఉన్న అవకాశాలను ప్రతి విద్యార్థికి చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా యువజన కార్యక్రమాల సలహా సంఘం సమావేశంలో అదనపు కలెక్టర్ పి. శ్రీజ సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మై భారత్ పోర్టల్ ద్వారా కేంద్ర ప్రభుత్వం యువతకు వివిధ రంగాలలో అవకాశం కల్పిస్తుందన్నారు. ప్రస్తుతం జిల్లాలో సుమారు 14 వే మంది యువత ఈ పోర్టల్‌లో నమోదు చేసుకున్నారని ఈ సంఖ్యను మరింత పెంచాలన్నారు. జిల్లాలో ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడికల్, నర్సింగ్ కళాశాలలతో పాటు అన్ని విద్యా సంస్థలను సందర్శించి ప్రతి విద్యార్థిని మై భారత్ పోర్టల్‌లో నమోదు చేయించాలని ఆదేశించారు. అలాగే ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులను కూడా తప్పనిసరిగా నమోదు చేయించాలన్నారు. జిల్లా స్థాయిలో యూత్ పార్లమెంట్ నిర్వహించి విజేతలను రాష్ట్ర స్థాయికి పంపాలని, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చిన యువతకు భారత పార్లమెంటులో పాల్గొనే అవకాశం లభిస్తుందన్నారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో నిర్వహించే క్విజ్ పోటీల్లో విజేతలకు దేశ సరిహద్దు రాష్ట్రాల పర్యటనకు అవకాశం లభిస్తుందని ప్రతిభ కనబర్చిన వారికి ప్రధాన మంత్రిని కలిసే అవకాశం కూడా ఉంటుందని తెలిపారు. నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా వ్యాసరచన, చిత్రలేఖనం తదితర ఎనిమిది రకాల పోటీలను జిల్లాలో నిర్వహించాలని సూచించారు. ప్రతి నెల చివరి ఆదివారం కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిస్ట్రిక్ యూత్ ఆఫీసర్ వెంకట్రామ్ బాబు, జిల్లా ఉపాధి అధికారి ఎన్. మాధవి, జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జ్యోతి, లీడ్ బ్యాంక్ మేనేజర్ రవిప్రసాద్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, డిఎస్‌డివో సునీల్‌రెడ్డి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి శ్రీనివాసరావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పత్తి పంటకు జీవం పోసిన వర్షం

**- రైతుల్లో చిగురించిన ఆశలు**



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** తిరుమలాయపాలెం మండలంలో కురిసిన భారీ వర్షంతో రైతుల్లో కొత్త ఆశలు చిగురించాయి. గత కొంత కాలంగా వర్షాభావ పరిస్థితులతో ఇబ్బందులు ఎదుర్కొంటూ నాటిన పత్తి పంట ఎండిపోతుందేమోనని ఆందోళన చెందిన రైతులకు ఈ వర్షం ఊరటనిచ్చింది. వర్షపు నీటితో పదును ఏర్పడటం పత్తి మొక్కలకు జీవం లభించిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పిండిప్రోలు, తిరుమలాయపాలెం, కొక్కిరేణి, ఎర్రగడ్డ, తాళ్లచెరువు, బీరోలు, దమ్మాయిగూడెం, కేశవాపురం, తిప్పారెడ్డిగూడెం, హైదర్‌సాయిపేట, పాతర్లపాడు, జల్లేపల్లి, మాధురిపురం, సుబ్లేడు, కాకరవాయి, జూపెడ, పైనంపల్లి, సోలిపురం, బచ్చోడు, హస్నాబాద్‌తో పాటు పలు గ్రామాల్లో సోమవారం, మంగళవారం భారీ వర్షం కురవగా వర్షంతో ప్రతి పంట పొలాలు కళకళలాడుతున్నాయి. వర్షం అనంతరం రైతులు కలుపు తీయడం, ఎరువుల వేయడం, ఇతర వ్యవసాయ పనులను వేగవంతం చేశారు. ఖరీఫ్ సీజన్‌కు ఈ వర్షాలు ఎంతో ఉపయోగపడతాయని, రానున్న రోజుల్లో కూడా ఇదే విధంగా వర్షాలు కరిస్తే పంటలు ఆశాజనకంగా ఉంటాయని రైతులు అభిప్రాయపడుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు కూడా రైతులు వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల నిర్వహణ చేపట్టాలని సూచిస్తున్నారు. సమయానికి కురిసిన ఈ వర్షం పత్తితో పాటు ఇతర ఖరీఫ్ పంటలకు కూడా మేలు చేస్తుందని, మంచి దిగుబడులు సాధించే అవకాశాలు ఉన్నాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా రైతులు ఉత్సాహంగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమై కన్పించారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో సోషల్ ఆడిట్

**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలంలోని ఉన్నత పాఠశాలల్లో మంగళవారం సోషల్ ఆడిట్ ప్రారంభమైంది. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ నియమించిన సోషల్ ఆడిట్ కమిటీ సభ్యులు సంపత్ శ్రీచైతన్య కుమార్ తొలి రోజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గన్నవరంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. తదుపరి గరికపాడు కాంప్లెక్స్ పరిధిలోని గరికపాడు, సిరిపురం(కెజి) ఉన్నత పాఠశాలలు అలాగే గవర్నమెంట్ హైస్కూల్ వైరా, రెబ్బవరం క్లస్టర్ పరిధిలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో సోషల్ ఆడిట్ నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్, తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులు, ఉపధ్యాయులను ఆడిట్ కమిటీ విచారించింది. అనంతరం సమగ్ర నివేదికను రాష్ట్ర పాఠశాల విద్యాశాఖకు సమర్పించనున్నారు. ఆడిట్ కమిటీ సభ్యులు చైతన్యకుమార్ మాట్లాడుతూ అందరు ప్రధానోపాధ్యాయులు సోషల్ ఆడిట్‌కు సంబంధించిన రికార్డులు, నివేదికలు, ధృవపత్రాలు, మెటీరియల్, స్టాక్ రిజిస్టర్స్ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి చావా శ్రీనివాసరావు, గన్నవరం గ్రామ సర్పంచ్ యేసు, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ముదిగొండ ఇంఛార్జి ఎంపీఓగా రామకృష్ణ



**ప్రజాపక్షం/ముదిగొండ:** మండల ఇంఛార్జి పంచాయతీ అధికారి(ఎంపీఓ)గా మండల పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన అధికారికంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని గ్రామ పంచాయతీల సమగ్రాభివృద్ధి, ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రాధాన్యత నిస్తూ విధులు నిర్వర్తిస్తానని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా అందేలా అన్ని శాఖల అధికారులతో సమన్వయంతో ముందుకుసాగుతా అన్నారు. ఈ మేరకు సర్పంచి కట్టకూరి ఉపేందర్ శాలువాతో సన్మానించి సత్కరించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, సురక్షిత తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణతోపాటు మౌళిక సదుపాయాలు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మెట్టెల సతీశ్, ఎస్.కే. దస్తగిరి, గ్రామస్తులు మనకేన దామోదర్, రావులపాటి స్వరాజ్, చెరుకూరి ఉపేందర్ తదితరులు పాల్గొని రామకృష్ణకు శుభాకాంక్షలు తెలిపారు.

# జీతాలు ఇవ్వడంలేదని ఎంపీడీఓకు వినతి



**ప్రజాపక్షం/ముదిగొండ:** వివిజీ క్షేత్ర సహాయకులకు గత మూడు మాసాలుగా వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మండల క్షేత్ర సహాయకుల సంఘం సభ్యులు ఎంపీడీఓ విజయకు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీఓ రంగనాయకమ్మ మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంతాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాల అమలులో క్షేత్ర సహాయకులు కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ మూడు మాసాలుగా వేతనాలు అందక కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. జీతాల చెల్లింపులో జాప్యం కారణంగా క్షేత్ర సహాయకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నట్లు తెలిపారు. సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి బకాయి వేతనాలను విడుదల చేసేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

# టూరిస్ట్ బస్సు.. డీసీఎం ఢీ

**-డీసీఎం డ్రైవర్ మృతి**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ప్రైవేట్ బస్సు డ్రైవర్ అతి వేగం అజాగ్రత్త కారణంగా ఓ డీసీఎం డ్రైవర్ అత్యంత విషాదకరంగా మృతి చెందిన సంఘటన ఖమ్మం రూరల్ మండలంలో మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, తూర్పు గోదావరి జిల్లా, నిడదవోలు మండలం సీతంపేట గ్రామానికి చెందిన పూటి తేజ(24) చేపలుపట్టే వాళ్ళతో సూర్యాపేట జిల్లా, మోతే మండలం, నామవరం గ్రామానికి వెళ్లి డీసీఎం తోలుకుంటూ సత్తుపల్లికి తిరిగివస్తున్నాడు. ఈ నేపథ్యంలో మార్గం మధ్యలోని కోదాడక్రాస్‌రోడ్ దగ్గరకు రాగానే ఖమ్మం వైపు నుండి హైదరాబాద్ వైపు వెలుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డీసీఎం డ్రైవర్ పూటి తేజ తల మొండెం నుంచి వేరయ్యింది. అలాగే బస్సు డ్రైవర్‌కి స్వల్ప గాయాలయ్యాయి. ఘటనపై కుటుంబ సభ్యుడు కూటి వీరబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ ముష్కరాజు తెలిపారు.

# పత్తి పంటకు ఊపిరి పోసిన వర్షం



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో గత నాలుగు రోజుల నుంచి సాధారణ వర్షపాతం వలన మండలంలో పత్తి పంటకు ఊపిరినిచ్చింది. గత 15 రోజులుగా వర్షం లేనందున పత్తి పంట వాడబడిపోవడంతో రైతుల్లో నిరాశ ఏర్పడింది. దీనివల్ల గత నాలుగు రోజులు బట్టి సాధారణ వర్షపాతం చిరుజల్లులతో వర్షం పడుతుండటంతో పత్తి పంటకు ఊపిరి పోసినట్లుంది. మండల పరిధిలోని 3500 ఎకరాల్లో ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్లో పత్తి పంటను 2200 మంది రైతులు పంటను కొనసాగిస్తున్నారు. మండల పరిధిలోని పెద్ద కోరుకొండి, చిన్న కోరుకొండి, చెన్నూరు, లింగాల, వెన్నవల్లి, బత్తులపల్లి, పేరువంచ, యజ్ఞ నారాయణపురం తదితర గ్రామాలలో ఈ పంటను ఆశాజనకంగా రైతులు సాగు చేస్తున్నారు. ఈ సాధారణ వర్షపాతం పత్తి పంటకు ఊరటనిచ్చిందని వ్యవసాయ శాఖ అధికారిని రూప పేర్కొన్నారు దీనివలన పత్తి రైతులు ఆనందంలో ఉన్నారు.

# ఏఐటియూసి రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/సత్తుపల్లిః** ఈ నెల 26న నిర్వహించనున్న ఏఐటియూసి 3వ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ సత్తుపల్లి మండలంలోని పలు గ్రామపంచాయతీల్లో మంగళవారం విస్తృత ప్రచార కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు నిమ్మటూరి రామకృష్ణ మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం జరుగుతున్న రాష్ట్ర మహాసభను కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో విజయవంతం చేయాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఏఐటియూసి జిల్లా సహాయ కార్యదర్శి నిమ్మటూరి రామకృష్ణ, సత్తుపల్లి మండల సీపీఐ కార్యదర్శి తడికమళ్ళ యోబు, బిల్డింగ్ వర్కర్స్ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీను, ఉద్యోగ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల మల్లయ్య, సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి మాగంటి రాజశేఖర్, కల్లూరు ప్రధాన కార్యదర్శి జానుపాటి మల్లేష్, కల్లూరు మండల ఉపాధ్యక్షుడు భానోత్ రమేష్, వైరా మండల నాయకుడు ఖమ్మంపాటి మహేష్, సత్తుపల్లి మండల నాయకులు ఉమామహేశ్వరరావు, ఓంకార్, సత్యనారాయణ, వెంకటనారాయణ పాల్గొన్నారు.

## పుల్ వీల్స్‌తో ట్రాక్టర్ నడిపితే కేసులు తప్పవు



ప్రజాపక్షం/ఏన్కూరు: రోడ్లపై పుల్ వీల్స్(ఇనుప చక్రాలు)అమర్చిన ట్రాక్టర్లను నడపడం చట్టరీత్యా నేరమని ఏన్కూర్ ఎస్ఐ నారబోయిన సంధ్య హెచ్చరించారు. మండల పరిధిలోని తూతక్క లింగన్నపేట గ్రామ ప్రధాన రహదారిపై పుల్ వీల్స్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌పై మంగళవారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రజల రాకపోకలకు అనువుగా ప్రభుత్వం నిర్మించిన రహదారులను ఉద్దేశపూర్వకంగా లేదా నిర్లక్ష్యంగా దెబ్బతీయడం నేరమన్నారు. ట్రాక్టర్లకు ఇనుప చక్రాలు అమర్చి సీసీ రోడ్లపై నడపడం వల్ల రహదారులు తీవ్రంగా దెబ్బ తింటాయని తెలిపారు. తూతక్కలింగన్నపేట గ్రామానికి చెందిన కూచిపూడి నరసింహారావుపై ప్రభుత్వ ఆస్తికి నష్టం కలిగించినందుకు సంబంధిత చట్టాల ప్రకారం ఏన్కూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. పుల్ వీల్స్‌తో వాహనాలు నడపడం వల్ల రోడ్లకు నష్టం వాటిల్లడంతో పాటు ప్రజాధనం వృథా అవుతుందని, రహదారులపై ప్రయాణించే వాహనదారులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఇకపై ఎవరైనా ట్రాక్టర్లు లేదా ఇతర వాహనాలకు పుల్‌వీల్స్ అమర్చి రహదారులపై నడిపి ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగిస్తే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## నీట్ పేపర్ లీక్‌పై కేంద్ర మంత్రి రాజీనామా చేయాలి



ప్రజాపక్షం/కారేపల్లి: నీట్ పేపర్ లీక్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ వైరా ఇన్‌చార్జి భూక్య శివ నాయక్ డిమాండ్ చేశారు. ఢిల్లీలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న నిరుద్యోగ యువత, విద్యార్థులపై లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగించడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఖండించారు. కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగ సమస్య పరిష్కారంలో విఫలమైందని, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని విమర్శించారు. ఎన్‌టీఏను రద్దు చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, లేదంటే రైతాంగ ఉద్యమ స్ఫూర్తితో దేశ వ్యాప్తంగా నిరుద్యోగులు, విద్యార్థులతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు మంగన్న, రామ్‌చందర్, పాపారావు, శ్రీను, లాలు, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై లాఠీచార్జ్‌ని ఖండిస్తున్నాం




ప్రజాపక్షం/కారేపల్లి: ఢిల్లీలో విద్యార్థులు, నిరుద్యోగులపై జరిగిన లాఠీచార్జ్‌ను నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కారేపల్లిలో ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు కొండబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కె నరేంద్ర మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యార్థులపై నమోదైన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి ఆదేర్ల వినయ్‌కుమార్, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు చిలుముల భరత్, కాకాటి పృథ్వీ, వెంకీ, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడం తగదు




ప్రజాపక్షం/ఇల్లందు: నీట్ పేపర్ లీక్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు భూక్య శివ నాయక్ డిమాండ్ చేశారు. ఢిల్లీలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న నిరుద్యోగ యువత, విద్యార్థులపై లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగించడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఖండించారు. కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగ సమస్య పరిష్కారంలో విఫలమైందని, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని విమర్శించారు. ఎన్‌టీఏను రద్దు చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, లేదంటే రైతాంగ ఉద్యమ స్ఫూర్తితో దేశ వ్యాప్తంగా నిరుద్యోగులు, విద్యార్థులతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు మంగన్న, రామ్‌చందర్, పాపారావు, శ్రీను, లాలు, గణేష్, తదితరులు పాల్గొన్నారు.


## సిపిఐ సభ్యులు చిలివేరు ఉపలయ్య మృతి



ప్రజాపక్షం/నేలకొండపల్లి : మండలంలోని భైరవునిపల్లి గ్రామానికి చెందిన చిలివేరు ఉపలయ్య (80) మంగళవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో మృతి చెందారు విషయం తెలుసుకున్న పార్టీ శ్రేణులు అయిన భౌతిక కాయాన్ని సందర్శించి ఎర్రజెండా కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. నివాళులు అర్పించిన వారిలో సిపిఐ పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి బాలిన కృష్ణంరాజు,ఉప సర్పంచ్ ఆలేటి ఉమామహేష్, సహాయ కార్యదర్శి లు భద్రాజీ వేంకటేశ్వరరావు, బాలేబోయిన వేంకటేశ్వర్లు, శాఖ సభ్యులు కుంచం బిక్షం, కనకబండి రామయ్య, పొలంపల్లి నారయణ, చుట్టూ వెంకన్న లు ఉన్నారు.

# మెదడు..మనిషి జీవితానికి కమాండ్ సెంటర్..!

**-బ్రెయిన్ స్ట్రోక్..గోల్డెన్ అవర్''లో చికిత్సే ప్రాణ రక్షణ**
**-ప్రముఖ సీనియర్ న్యూరో ఫిజిషియన్ నిఖిల్ రేపాక**
**-జూలై 22 వరల్డ్ బ్రెయిన్ డే సందర్భంగా ప్రత్యేక కథనం**





ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం: మనిషి శరీరంలో ప్రతి అవయవాన్ని నియంత్రించే కేంద్రం మెదడు. ఆలోచన, జ్ఞాపకశక్తి, మాట, నడక, భావోద్వేగాలు, నిర్ణయాలు... ప్రతి క్షణం మన జీవితాన్ని నడిపించే మెదడే. అలాంటి మెదడుకు రక్తప్రసరణలో మన జీవితాన్ని నడిపించేది మెదడే. అలాంటి మెదడుకు రక్తప్రసరణలో కేవలం కొన్నినిమిషాల అంతరాయం ఏర్పడినా తీవ్ర పరిణామాలు ఎదురవుతాయి. అదే బ్రెయిన్ స్ట్రోక్. ప్రపంచవ్యాప్తంగా గుండె జబ్బుల తర్వాత అత్యధిక మరణాలకు కారణమవుతున్న వ్యాధుల్లో బ్రెయిన్ స్ట్రోక్ ఒకటి. అయితే సకాలంలో గుర్తించి చికిత్స అందిస్తే ప్రాణాలను కాపాడటమే కాకుండా శాశ్వత వైకల్యాన్ని కూడా నివారించవచ్చని న్యూరాలజీ నిపుణులు చెబుతున్నారు.

**-నిమిషాల ఆలస్యం.. జీవితాంతం బాధ...**

స్ట్రోక్ వచ్చినప్పుడు మెదడులోని లక్షలాది కణాలు ప్రతి నిమిషం నశిస్తుంటాయి. అందుకే వైద్యులు దీనిని ''టైమ్ ఈజ్ బ్రెయిన్'' అని అంటారు. లక్షణాలు కనిపించిన వెంటనే ఆస్పత్రికి చేరుకుంటే గోల్డెన్ అవర్‌లో చికిత్స అందించి రోగిని సాధారణ జీవితానికి తీసుకురావడం సాధ్యమవుతుంది.

**-ఈ లక్షణాలను అసలు నిర్లక్ష్యం చేయొద్దు**

ముఖం ఒకవైపు వంగిపోవడం, ఒక చేయి లేదా కాలు అకస్మాత్తుగా బలహీనపడటం, మాట స్పష్టంగా రాకపోవడం లేదా మాట్లాడలేకపోవడం, చూపు మసకబారడం, తీవ్రమైన తలనొప్పి, తల తిరగడం, సమతుల్యత కోల్పోవడం ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని స్ట్రోక్ చికిత్స అందించే ఆస్పత్రికి తరలించాలి.

### మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత




మెదడు మన శరీరాన్ని కమాండ్ సెంటర్ అని, దాని ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తే తీవ్రమైన పరిణామాలు ఎదురయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా స్ట్రోక్, అల్జీమర్స్, పార్కిన్సన్స్, ఎపిలెప్సీ, మైగ్రేన్ వంటి నరాల సంబంధిత వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల్లో అవగాహన కల్పించడమే వరల్డ్ బ్రెయిన్ డే ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రస్తుత యువతలో కూడా బ్రెయిన్ స్ట్రోక్ కేసులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధిక రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్, ధూమపానం, మద్యపానం, మధుమేహం, ఊబకాయం, మానసిక ఒత్తిడి వ్యాయామం లేకపోవడం వంటి కారణాలు స్ట్రోక్ ప్రమాదాన్ని పెంచుతున్నాయని చెప్పారు. ఆరోగ్యకరమైన మెదడే ఆరోగ్యకరమైన జీవితానికి పునాది. మెదడును కాపాడుకోవడం అంటే భవిష్యత్‌ను కాపాడుకోవడమే అని వరల్డ్ బ్రెయిన్ డే సందర్భంగా ప్రజలకు పిలుపునిచ్చారు.

-డాక్టర్ నిఖిల్ రేపాక, సీనియర్ న్యూరో ఫిజిషియన్, జాగృత్ హాస్పటల్, ఖమ్మం

**-ఎవరికైనా రావచ్చు. కానీ వీరికి ఎక్కువ ప్రమాదం..**

అధిక రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్, గుండె జబ్బులు, ధూమపానం, మద్యపానం, ఊబకాయం, వ్యాయామం లేకపోవడం, అధిక మానసిక ఒత్తిడి ఉన్నవారిలో స్ట్రోక్ ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.

**-జీవనశైలిలో చిన్నమార్పులు..పెద్ద రక్షణ**

రక్తపోటును నియంత్రణలో ఉంచడం, సమతుల ఆహారం తీసుకోవడం, రోజూ కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేయడం, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండడం, తగినంత నిద్రపోవడం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా బ్రెయిన్ స్ట్రోక్ ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చు.

**-వరల్డ్ బ్రెయిన్ డే సందేశం...**

ప్రతి సంవత్సరం జూలై 22న నిర్వహించే వరల్డ్ బ్రెయిన్ డే ఉద్దేశం మెదడు ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంచడం, స్ట్రోక్ లక్షణాలను ముందుగానే గుర్తించడం, సకాలంలో వైద్యం పొందడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారా అనేక ప్రాణాలను కాపాడవచ్చని వైద్యనిపుణులు సూచిస్తున్నారు.

## కార్పొరేట్ మెడికల్ బోర్డు ఫలితాలపై పునఃసమీక్షించాలి





ప్రజాపక్షం/చుంచుపల్లి: ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించిన కార్పొరేట్ మెడికల్ బోర్డు ఫలితాలపై పునఃసమీక్ష చేపట్టి, అనారోగ్యంతో ఉన్న కార్మికులకు న్యాయం చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటీయూసీ) యాజమాన్యాన్ని డిమాండ్ చేసింది. ఎఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ పిలుపు మేరకు మంగళవారం సింగరేణి వ్యాప్తంగా అన్ని గనులు, విభాగాల్లో వినతిపత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కొత్తగూడెం ఏరియాలోని అన్ని గనులు, విభాగాల్లో ఎఐటీయూసీ నాయకులు సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా సుమారు 2000 మంది కార్మికులు ఏళ్ల తరబడి మెడికల్ బోర్డు కోసం ఎదురుచూస్తుండగా, కేవలం 120 మందికి మాత్రమే బోర్డు నిర్వహించడం తీవ్ర అన్యాయమని పేర్కొన్నారు. మెడికల్ బోర్డుకు ఎంపికైన వారిలో 28 మంది కార్మికులకు హాజరు కావాల్సిన సమాచారం సకాలంలో అందకపోవడం యాజమాన్యం నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. అలాగే బోర్డుకు హాజరైన 120 మందిలో కేవలం 24 మందిని మాత్రమే ఇన్వాలిడేషన్‌కు అర్హులుగా ప్రకటించడం గతంలో నిర్వహించిన మెడికల్ బోర్డులతో పోలిస్తే అత్యంత తక్కువ శాతమని తెలిపారు. బొగ్గు గనుల్లో, ముఖ్యంగా అండర్‌గ్రౌండ్‌లో దశాబ్దాలుగా పనిచేస్తున్న కార్మికులు కీళ్ల నొప్పులు, వెన్నెముక సమస్యలు, శ్వాసకోశ వ్యాధులు వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నప్పటికీ వాటిని సమగ్రంగా పరిగణనలోకి తీసుకోకుండా ఫలితాలు ప్రకటించడం వల్ల నిజంగా అనారోగ్యంతో ఉన్న కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల గతంలో దరఖాస్తు చేసుకుని ఇప్పటికీ మెడికల్ బోర్డు కోసం ఎదురుచూస్తున్న కార్మికులందరికీ తక్షణమే మరోసారి కార్పొరేట్ మెడికల్ బోర్డు నిర్వహించాలని, ప్రతి కార్మికుడి ఆరోగ్య పరిస్థితిని నిష్పాక్షికంగా పరిశీలించి అర్హులైన వారిని ఇన్వాలిడేషన్ చేసి, వారి వారసులకు ఉద్యోగాలు కల్పించి కార్మిక కుటుంబాలకు న్యాయం చేయాలని ఎఐటీయూసీ నాయకులు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సహాయ కార్యదర్శి గట్టయ్య, ఉపాధ్యక్షులు కత్తర్ల రాములు, ఆఫీస్ బేరర్లు సందబోయిన శ్రీనివాస్, హీరాలాల్, కర్రు రమేష్, గుమ్మడి వీరయ్య, పిట్ కార్యదర్శులు ఎం.ఆర్.కె ప్రసాద్, మధు కృష్ణ, కమల్, సురేందర్, నాయకులు రాజాలపూడి సాంబమూర్తి, బండారి మల్లయ్య, సాయి పవన్, సందీప్, శశివర్ధన్ రెడ్డి, సురేంద్రరెడ్డి, వెంకటరమణ, కుమార్‌రావు, మురళి, అప్పారావు, కొవ్వూరు రాజేశ్వరరావు, అవినాష గావిని నాగరాజు, సుబ్రమణ్యం, మెంగన్ రవి, కోటి, ఓం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఒకేసారి మళ్లీ మూడు నెలల రేషన్..!

**- ఆగస్టు నుండి అక్టోబర్ కోటా పంపిణీకి సన్నాహాలు**
**- జిల్లాలో మొత్తం 2,79,179 రేషన్ కార్డులు**
**- మూడు నెలలకుగానూ 16473 మెట్రిక్ టన్నులు సరఫరా**




ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : ప్రభుత్వం మరో సారి మూడు నెలలకు సరిపడా రేషన్ బియ్యాన్ని ఇవ్వాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి మూడు నెలల కోటా రేషన్ బియ్యం పంపిణీకి సన్నాహాలు ప్రారంభించారు. ఆగస్టు, సెప్టెంబర్ అక్టోబర్ ల బియ్యాన్ని ఒకే సారి లబ్ధిదారులకు అందించేందుకు అవసరమైన నిల్వలు, రవాణా తదితర అంశాలపై ప్రజాపంపిణీ పౌరసరఫరాల శాఖ సిద్ధమవుతోంది. గోదాముల నుంచి రేషన్ షాపుల డీలర్లకు బియ్యం తరలింపు ముందస్తు సమాచారం, రవాణా, ఈ పాస్ యంత్రాల సంసిద్ధతపై అధికారులు కసరత్తు మొదలు పెట్టారు. మూడునెలల బియ్యాన్ని నిల్వ చేసుకునేందుకు రేషన్ డీలర్లు సైతం అవసరమైన స్టాక్ పాయింట్లను సమకూర్చుకుంటున్నారు.

**జిల్లాలో ఇలా :** జిల్లాలోని 23 మండలాల వ్యాప్తంగా 559 రేషన్ షాపులు ఉన్నాయి. ఈ మొత్తంగా 2,79,179 రేషన్ కార్డులు ఉండగా 915090 మంది సభ్యులున్నారు. వీరిలో ఒక్కక్కరికి నెలకు 6 కిలోల చొప్పున 5500 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేస్తారు. ఇప్పుడు మూడు నెలలకు కలిపి 16500 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేయాల్సి ఉంటుంది. ఇందుకు అనుగుణంగా జిల్లాలో ఉన్న సన్న బియ్యం నిల్వలు లెక్కలు కట్టి అవసరాన్ని బట్టి రాష్ట్రస్థాయి నుండి అదనంగా బియ్యాన్ని తెప్పించేందుకు కసరత్తు చేస్తున్నారు.

**మిశ్రమ స్పందన :** మూడునెలల ప ంపిణీపై ఈ సారి కూడా శ్రీకారం చుట్టంగా, కైవలం జూన్ మెలలో మాత్రమే ఒక్క నెల బియ్యాన్ని అందించారు. ఇప్పుడు ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ మాసాలకు సంబంధించి ఇవ్వనున్నారు. అయితే ఈ విధానంపై లబ్దిదారులు, రేషన్ షాపుల డీలర్లతో పాటు హమాలీలు, అధికారుల నుంచి మిశ్రమ స్పందన వస్తోంది. ఇలా మూడు నెలల రేషన్ ఒకేసారి ఇవ్వడం వల్ల తరుచూ రేషన్ దుకాణాలకు వెళ్లాల్సిన అవసరం తప్పుతుందని లబ్దిదారులు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా రేషన్ షాపుల డీలర్లు మాత్రం మూడు నెలల స్టాక్ నిల్వలు పెట్టడానికి ఇబ్బందిగా మారుతోందని, మరో ప్రక్క మూడు నెలలకు సంబంధించి మూడు సార్లు వేలిముద్రలు వేయడం వల్ల పంపిణీలో తీవ్ర జాప్యం జరుగుతోందని అంటున్నారు. ఇదిలా ఉండగా మూడునెలల రేషన్ సరఫరాపై హమాలీలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎగుమతి దిగుమతి మోయలేని భారం పడుతోందని, ప్రతీనెలా పంపిణీ విధానమే బాగుందని అంటున్నట్లు తెలుస్తోంది.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం**




ప్రజాపక్షం/మణుగూరు: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ అన్నారు. భారత ప్రభుత్వ బొగ్గు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని కోల్ కంట్రోలర్ ఆర్గనైజేషన్ ఆదేశాలు మరియు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కార్పొరేట్ కార్యాలయం సూచనల మేరకు మంగళవారం మణుగూరు ఏరియాలోని మణుగూరు ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ లో భారీ స్థాయిలో వృక్షారోపణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత. నేటి వృక్షారోపణే భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించాలనే లక్ష్యంతో మెగా ప్లాంటేషన్ కార్యక్రమం మణుగూరు ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు నందు ఘనంగా నిర్వహించబడింది మరియు పచ్చదనాన్ని పెంపొందించడం, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడం, జీవవైవిధ్యాన్ని కాపాడడం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణ, హరితావరణ విస్తరణ మరియు సుస్థిర మైనింగ్ లక్ష్యాలతో మణుగూరు ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ నందు 550 మొక్కలను నాటారు కార్యక్రమంలో భాగంగా మణుగూరు ఏరియాకు నిర్దేశించిన 10,000 మొక్కలను ప్రాజెక్టు పరిధిలోని రీక్లెయిమ్డ్ మైన్ ప్రాంతాలు, ఓబీ దంపులు, రహదారి పక్కన ఉన్న ప్రదేశాలు మరియు ఇతర అనుకూల ప్రాంతాల్లో నాటారు. ఈ కార్యక్రమంలో మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ ఆధ్వర్యంలో అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, కాంట్రాక్ట్ కార్మికులు మరియు పర్యావరణ విభాగం మరియు ఫారెస్ట్రీ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని మొక్కలు నాటారు. నాటిన మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు, వాటి జియోట్యాగింగ్, ఫోటోలు, వీడియోల నమోదు కూడా చేపట్టారు. మొక్కల మనుగడ శాతాన్ని పెంచేందుకు నిరంతర సంరక్షణ చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎసీ టు జిఎం డి. వెంకటరామరావు, ఆఫీసర్ ఏజిఎం (పర్సనల్) ఎస్. రమేశ్, పిఓ కేపియాజి వేణుమాధవ్, ఏరియా ఇంజినీర్ బి. మధన్ నాయక్, పిఓ ఎంఎన్ఐఓసీ ఈ, శ్రీనివాస్, మేనేజర్ ఎంఎన్ ఓసి టి. శ్రీరంగ రెడ్డి, ప్రాజెక్ట్ ఇంజినీర్ ఎంఎన్ఐఓసి సురేశ్ , ఎంఎన్ఐఓసి పర్యావరణ అధికారి కిషన్ రామ్, ఏరియా పర్యావరణ అధికారి జే. శ్రీనివాస్, ఏరియా ఎస్టేట్ అధికారి స్వప్న, ఏరియా ఫారెస్ట్ అధికారి బి. కల్యాణ్, సెక్యూరిటీ అధికారి కె. శ్రీనివాస్, సంక్షేమ అధికారి డి. నరేశ్, గుర్తింపు ప్రతినిధ్య సంఘాల నాయకులు ఏఐటియూసి బ్రాంచ్ సెక్రటరీ వై. రాంగోపాల్, ఐఎన్టీయూసీ బ్రాంచ్ సెక్రటరీ వి. కృష్ణంరాజు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రెచ్చిపోతున్న కోతులు.. భయపడుతున్న విద్యార్థులు..!




**తక్షణమే కోతుల బెడద నుంచి రక్షించాలని వేడుకుంటున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు**



ప్రజాపక్షం/పాల్వంచ : పాల్వంచలోని ఓబాలికల ఆశ్రమ పాఠశాలపై కోతులు పంజా విసురుతున్నాయి. దీనితో భయపడిన కొందరు విద్యార్థులు పారిపోయారని పుకార్లు షికార్లు చేస్తున్నాయి. రాష్ట్రంలో కొలువుదీరిన కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తున్నదని అమాత్యులు పదే పదే చెపుతున్నారు. ఆశ్రమ పాఠశాలకు నూతన భవనాలను నిర్మించటంలో బిసి వెల్ఫేర్ ఉన్నతాధికారులు తగిన శ్రద్ధ వహించటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనితో విద్యార్థులకు రక్షణ లేకుండా పోతున్నది. కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ పాల్వంచ పరిధి 35వ, డివిజన్ జ్యోతీనగర్‌లోని అద్దె భవనంలో ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతీ బాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు చుట్టూ ప్రహరీ లేదు. చుట్టూ ఉన్న పెద్ద పెద్ద చెట్లను కోతులు ఆవాసాలుగా మార్చుకొన్నాయి. ఆశ్రమ పాఠశాల విద్యార్థులు, సిబ్బందిపై కోతుల పంజా విసురుతున్నాయి. ఇటీవల కాలంలో ఒకరిపై పడిన కోతి ఇష్టారీతిన కరచిందని సమాచారం. దీనితో విద్యార్థులు భయటకు రావాలంటేనే భయపడి పోతున్నారు. లంచ్, డిన్నర్ సమయంలో ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులకు కాపలాగా ఉంటున్నారు. కోతులకు భయపడి కొందరు విద్యార్థులు పారిపోయారని పాల్వంచ వ్యాప్తంగా పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఈ విషయంపై పాఠశాల ప్రిన్సిపాల్ అరుణ క్రాంతి వివరణ కోరగా కోతుల బెడద ఉందన్నారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళామని అనువైన మరో భవనం కోసం అన్వేషిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు పారిపోయారనేది అవాస్తవమన్నారు.

## నీట్ విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడం దుర్మార్గం




ప్రజాపక్షం/ఆళ్లపల్లి: ఢిల్లీలో నీట్ విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌ను సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆళ్లపల్లి మండల కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈసందర్భంగా మండల కార్యదర్శి బట్టు సురేష్ మాట్లాడుతూ నీట్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరితే లాఠీచార్జ్ చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని విమర్శించారు. విద్యార్థుల ఆవేదనను ప్రభుత్వం పట్టించుకుని వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆళ్లపల్లి మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల నాయకులు మెస్సు గోపాల్, బత్తిని సత్యం, గోగ్గెల గాదేరాజు, తోట వీరభద్రం, పూనెం బక్కన్న, తెల్లం కృష్ణ, ఈర్ప సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌ను విజయవంతం చేయండి



ప్రజాపక్షం/ఆళ్లపల్లి: ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వాసం శ్రీకాంత్ అన్నారు. మంగళవారం పినపాక ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ఆయన ఆధ్వర్యంలో ఎస్ఐఆర్(ప్రత్యేక ఓటరు జాబితా సవరణ)కార్యక్రమంపై మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బీఎల్ఓలకు సహకరిస్తూ ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని నూటికి నూరు శాతం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతనంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన వాసం శ్రీకాంత్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ పడిగ సమ్మయ్య, సీనియర్ నాయకుడు ఎండీ అతహర్, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి నులకతాటి శ్రీను, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఇనుముల ఇందుకుమార్, వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, యువజన, మహిళా నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ల జీవనోపాధిని కాపాడాలి



ప్రజాపక్షం/అశ్వాపురం: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలుతో ఆటో డ్రైవర్ల ఉపాధి తీవ్రంగా దెబ్బతిందని అశ్వాపురం ఆటో యూనియన్ సీనియర్ నాయకులు, మాజీ అధ్యక్షుడు భాగవతపు సతీష్ అన్నారు. ఆటో ఫైనాన్స్‌లు, కుటుంబ పోషణ, పిల్లల చదువుల భారం మోయలేక అనేక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. తల్లిదండ్రుల అంగీకారంతోనే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు విద్యార్థులకు ఆటోలలో రవాణా చేస్తూ జీవనోపాధి కొనసాగిస్తున్నామని చెప్పారు. కొంత మంది జర్నలిస్టులు ఆటోలను లక్ష్యంగా చేసుకుని కథనాలు ప్రచురించడం వల్ల అధికారుల ఒత్తిడి పెరిగి తమ జీవనోపాధి ప్రమాదంలో పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో ఆటో యూనియన్ సీనియర్ నాయకులు, మాజీ అధ్యక్షుడు భాగవతపు సతీష్, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## నిరసనకారులపై లాఠీచార్జి చేయడం సరికాదు




ప్రజాపక్షం/అశ్వాపురం: ఢిల్లీలో నీట్ పేపర్ లీకేజీపై నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి, టియర్ గ్యాస్ ప్రయోగించడం ప్రజాస్వామ్య విరుద్ధమని తెలంగాణ జన సమితి జిల్లా కమిటీ ఖండించింది. జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీ ఘటనపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీ బాధిత కుటుంబాలకు నష్టపరిహారం ప్రకటించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. శాంతియుతంగా పార్లమెంట్ ముట్టడికి వెళ్తున్న విద్యార్థులపై బల ప్రయోగం చేయడం దుర్మార్గమని, లాఠీచార్జికి బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో అశ్వాపురం మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి మధు, లక్ష్మి , కాకర్ల రామారావు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు, నిరుద్యోగులపై లాఠీచార్జ్ అమానుషం




ప్రజాపక్షం/కూసుమంచి: ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద విద్యార్థులు, నిరుద్యోగులపై జరిగిన పోలీసు లాఠీచార్జ్‌ను ఖండిస్తూ డీవైఎఫ్ఐ కూసుమంచి మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బొడ్డు మధు మాట్లాడుతూ యువతకు ఉద్యోగాలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. విద్యార్థులు, నిరుద్యోగులపై నిర్బంధాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పాలేరు డివిజన్ సహాయ కార్యదర్శి తుడుం నాగరాజు మాట్లాడుతూ ఖాళీ ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, విద్యార్థులు, నిరుద్యోగులపై నమోదైన కేసులను ఎత్తివేసి అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని కోరారు.

# ఎస్ఐఆర్‌లో బిఎల్‌ఏలు, పార్టీ శ్రేణులు క్రియాశీలకంగా పనిచేయాలి

**- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా**



**ప్రజాపక్షం/చుంచుపల్లి:** ఎస్ఐఆర్ ప్రక్రియలో పార్టీ శ్రేణులు, బిఎల్ఏలు క్రియాశీలకంగా పనిచేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా పిలుపునిచ్చారు. పారదర్శకమైన, తప్పుల్లేని ఓటరు జాబితా రూపకల్పనకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై స్థానిక ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు అవగాహన కల్పించేందుకు సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం చుంచుపల్లి మండల పరిధిలోని గౌతంపూర్, రుద్రంపూర్, పెనగడప గ్రామాల్లో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులకు ముఖ్య అతిథిగా హాజరైన సాబీర్ పాషా మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైన సాధనమని, అర్హులైన పౌరులెవరూ ఓటరుగా నమోదు కాకుండా ఉండిపోకూడదని పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించడమే కాకుండా, ప్రస్తుతం ఉన్న ఓటర్ల ఓటు హక్కు రద్దు కాకుండా బిఎల్ఏలు (బూత్ లెవల్ ఏజెంట్లు) ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. ఓటర్ల జాబితాలోని తప్పుల సవరణ, మరణించిన వారి పేర్ల తొలగింపు, చిరునామా మార్పు వంటి అంశాలను బిఎల్ఏలు నిరంతరం పర్యవేక్షిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న బిఎల్ఓలు, ఎన్నికల సిబ్బందికి పూర్తి స్థాయిలో మద్దతుగా నిలిచి సహకరించాలని కోరారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేసి, పారదర్శకమైన జాబితా తయారీ ద్వారానే ప్రజాస్వామ్యం మరింత పరిపుష్టమవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ అవగాహన సదస్సుల్లో మేయర్ మూడ్ గణేష్, నాయకులు సలిగంటి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళి, గానగళ్ల వీరాస్వామి, వట్టికొండ మల్లికార్జున్ రావు, తోట రాజు, కె.రాములు, నీడల సుధాకర్, వెంకన్న, కట్ల ఉదయ్, జగదాంబ, తాజుద్దీన్, సర్పంచ్ కళ్యాణి, సతారాములు, బివి రమణ, బండారి మల్లయ్య, లక్ష్మణ్, గంగారాం, కొవ్వూరి రాజేశ్వరరావు, గుడిపూడి రవి, జోసెఫ్, భిక్షపతి, గిరిజాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# కేంద్ర విద్యాశాఖామంత్రి తక్షణమే రాజీనామా చేయాలి

**- నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎన్టిఏను రద్దు చేయాలి**
**- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** దేశవ్యాప్తంగా 22 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడిన కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్షకు ప్రశ్నాపత్రం లీక్ కావడం అత్యంత దుర్మార్గమైన చర్యని, పరీక్షలు నిర్వహించడం చేతకాని ఎన్టిఏను రద్దు చేయాలని అన్నారు. 19 రోజులుగా దీక్ష చేస్తున్న సోనమ్ వాంగ్ చుక్ దీక్షను భగ్నం చేసి ప్రజా స్వామ్యానికి విరుద్ధంగా ఆయన తీసుకెళ్లారని మండిపడ్డారు. ఏఐఎస్ఎఫ్ ఆల్ఇండియా సమితి నాయకులు బిట్టు అంకిత్ నాయకత్వంలో అదే ప్రాంగణంలో దీక్షను చేస్తున్నారని, విద్యాశాఖా మంత్రి రాజీనామా కోరుతూ పార్లమెంట్‌ను ముట్టడించిన విద్యార్థులు, వారి మద్దతు దారులపై పోలీసులు విచక్షణ రహితంగా లాఠీ ఛార్జీలు చేయడం కాల్పులు జరపడం చాలా దుర్మార్గమని, బిజెపి ప్రభుత్వం, ప్రధాని మోడి ఇప్పటికైనా ఇప్పటికైనా స్పందించి ఎన్టిఏను రద్దు చేసి విద్యాశాఖ మంత్రిని బర్తరఫ్ చేయాలని అన్నారు, లేని పక్ష్యంలో దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనా కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శులు గుగులోత్ వంశీ, మాణిక్యాల వినయ్ జిల్లా ఉపాధ్యక్షులు కొరిమి సంజయ్‌కుమార్, శ్యామ్, హారిక, నిఖిల తరుణి తదితరులు పాల్గొన్నారు.


# విద్యార్థులకు చక్కటి పౌష్టికాహారం అందిస్తున్నాం

**- ఐటిడిఏ పిఓ రాహుల్**



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఐటిడిఏ పరిధిలోని మారుమూల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సరైన రీతిలో మెనూ ప్రకారం బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తున్నామని ఐటిడిఏ పిఓ రాహుల్ ఇంక్రిషాట్ నంగియా కంపెనీ డాక్టర్ల బృందంకు వివరించారు. ఆ బృందం మంగళవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో పిఓను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటిడిఏ ద్వారా నడుస్తున్న పాఠశాలల పరిస్థితులు, సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమలు నడిపిస్తున్న గిరిజన మహిళలకు ఆర్థిక చేయూత నందించేందుకు భద్రగిరి మార్ట్ ఏర్పాటు చేసి ఆర్గానిక్ వస్తువులు, వాటి తయారీ, మిల్లెట్ బిస్కెట్లు తయారీ విధానంపై వివరించారు. ఇదిలా ఉండగా ఇక్కడ తయారయ్యే ఆర్గానిక్ వస్తువులు లండన్ వరకు వెళుతున్నాయని వారికి వివరించారు. సంస్థ ద్వారా మారుమూల ప్రాంతాల దుమ్ముగూడెం, చర్ల, అశ్వారావుపేట మండలాల్లోని మారుమూల గ్రామాల జిపిఎస్ అంగన్వాడీ ప్రైమరీ పాఠశాలల పిల్లలందరికీ అందించాలని అన్నారు. అదేవిధంగా పోషకాలు జోడించిన సంపూర్ణ తృణధాన్యాల గురించి పిల్లల తల్లి దండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఇక్రిషాట్ నంగియా కంపెనీ ద్వారా పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని 7 నుండి 10 సం. పిల్లలకు చక్కటి పౌష్టికాహారాన్ని అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే గిరిజన పాఠశాలలు సందర్శించామని పిఓకు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిడి చందన, ఏడిఎంహెచ్ఓ సైదులు, ఎంఇఓ రమ, వైద్యబృందం మాసన్ స్వామి కన్నా రూపా బెనర్జీ జుడి థామస్ అబినవ్ ఎంసి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఓ మోస్తరు వర్షం..!



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలో ఓ మోస్తరు వర్షం కురిసింది. సోమవారం రాత్రి నుండి జిల్లాలోని పలు చోట్ల వర్షం పడుతూనే ఉంది. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో వాన జల్లులు పడటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అక్కడక్కడా వరినాట్లు వేయగా పత్తి విత్తనాలు కూడా నాటారు. వరినాట్లను దక్కించుకోవడానికి ట్యాంకర్ల సహాయంతో నీరు తడపగా, పత్తి మొలకలను కాపాడుకునేందుకు రైతులు పెద్ద ఎత్తున శ్రమించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో సోమవారం నుండి జిల్లాలోని పలుచోట్ల వర్షం పడుతుండటంతో రైతుల మోముల్లో చిరునవ్వులు చిగురిస్తున్నాయి. ఇంత కాలం ఎల్‌నినో ఎఫెక్టుకు తడి ఆరిపోయిన నేలలు ఈ కొద్దిపాటి వర్షానికి జీవం పోసుకున్నట్లుగా మారాయి. గిరిమెల్లపాడు 22.8 మిల్లీమీటర్లు, మద్దుకూరు 21.5 20.5సెంట్లలో 19.3 మిల్లీ మీటర్ల ఓ మోస్తరు వర్షపాతం నమోదైంది. అదే విధంగా పాత కొత్తగూడెం, ములకలపల్లి అశ్వారావుపేట, అంకంపాలెం, 3 ఇంక్లైన్ లక్ష్మీ దేవిపల్లి మల్లారం ఇల్లెందు జూలూరుపాడు భద్రాచలంలో సాధారణ వర్షపాతం నమోదైంది. అదే విధంగా కోయగూడెం,మండలపల్లి కరకగూడెం యానంబైలు ఏడూళ్లబయ్యారం మణుగూరు సత్యనారాయణపురంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. ఒకే గ్రామంలో వర్షం పడినప్పటికీ కొంత ప్రాంతంలో కురవగా మరో ప్రాంతంలో చుక్కు చినుకు కూడా నేలరాల లేదు. జిల్లాలో ఇంకా నీటి చుక్కని నోచుకోని ప్రాంతాలు కూడా ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. మెండుగా వర్షాలు కురిసిన పసిడి పంటలు పండాలని రైతులు పూజలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఎల్‌నినో ప్రభావం అటవీ ప్రాంతమైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పెద్దగా ఉంటగ పోవచ్చని, అయినప్పటికీ రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారిస్తే మేలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

# ట్రాఫిక్ డైవర్షన్ ఎత్తివేత



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఇల్లెందు బొమ్మనపల్లి మార్గంలో ట్రాఫిక్ డైవర్షన్‌ను నిబంధనను ఎత్తివేస్తూ రాకపోకలకు అనుమతులు ఇస్తున్నట్లు డిఎస్పి ఆదినారాయణ తెలిపారు. జాతీయ రహదారిపై లోతు వాగు వద్ద చేపట్టిన బ్రిడ్జి మరమ్మత్తు పనులు పూర్తయ్యాయని, బుధవారం ఉదయం 8 గం. నుండి యథావిధిగా రాకపోకలు కొనసాగించుకోవచ్చని ఆయన వెల్లడించారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలను తప్పకుండా పాటిస్తూ ట్రాఫిక్ బోర్డులు ట్రాఫిక్ పోలీసుల సూచనల పాటించాలన్నారు. ప్రజల సహకారంతో మరమ్మత్తు పనులు సజావుగా పూర్తయ్యాయని, భవిష్యత్‌లో కూడా ప్రజలు ట్రాఫిక్ నియంత్రణలో ఇదే విధమైన సహకారం అందించాలన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతంగా మరమ్మత్తు పనులు పూర్తి చేయడంపై జిల్లా ఎస్పి రోహిత్ రాజ్ సంబంధిత అధికారులను, ఇంజనీరింగ్ నిపుణులతో పాటు పోలీసులను అభినందించారు.

# గిరిజన సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షునిగా సొందె



**ప్రజాపక్షం/మణుగూరు:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో 18, 19వ తేదీల్లో జరిగిన గిరిజన సమైక్య రాష్ట్ర మూడవ మహాసభలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుండి మణుగూరు ప్రాంతానికి చెందిన మాజీ ఎంపిటీసీ సొందె కుటుంబరావు గిరిజన సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక పట్ల మణుగూరు మండల గిరిజన సమైక్య హర్షం వ్యక్తం చేశారు. గిరిజన సమైక్యలో మండల స్థాయి నుండి, జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అంచలంచలుగా ఎదిగి గిరిజనుల సమస్యల పట్ల వారు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, జీవో నెంబర్ మూడును పునరుద్ధరించాలని, గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, ప్రభుత్వ మిగులు భూములను నిరుపేద గిరిజనులకు ఇవ్వాలని, పోడు సాగుదారులపై అధికారుల దాడులను నిలిపివేయాలని, గిరిజన గ్రామాల్లో విద్యా వైద్యం విద్యుత్ ఏర్పాటు చేయాలని, అటవీ హక్కుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, ఏజెండాగా భవిష్యత్తులో గిరిజన సమస్యల పట్ల పోరాటం కొనసాగిస్తామని, రాష్ట్ర పార్టీ ఇచ్చినటువంటి యొక్క పదవికి న్యాయం చేస్తానని వారు తెలియజేశారు. గిరిజన సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షులుగా సొందె కుటుంబరావు ఎన్నిక పట్ల మణుగూరు మండల గిరిజన సమైక్య నాయకులు బాడిశ సతీష్ కనితి సత్యనారాయణ, వజ్జా వెంకటేశ్వర్లు, కన్నబోయిన ప్రసాద్, గారబోయిన నరేష్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

# ఢిల్లీ ఘటనకు కేంద్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఢిల్లీ ఘటనకు కేంద్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరసన తెలిపేందుకు వచ్చిన విద్యార్థుల పై లాఠీ చార్జీ, టియర్ గ్యాస్ ప్రయోగాలు చేయటం సిగ్గు చేటు అన్నారు. ప్రజాస్వామ్యం ను ఖూనీ చేస్తుందన్నారు. నిరసన తెలిపే హక్కు లేకుండా చేయాలని చూస్తే కేంద్ర ప్రభుత్వం కు తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. నీట్ పేపర్ లీకేజీ పై దేశ వ్యాప్తంగా నిరసనచేపట్టారని పేర్కొన్నారు. విద్యార్థుల ఉద్యమాన్ని లాఠీ చార్జీలతో ఉద్యమాన్ని అణిచి వేయాలని చూడటం మూర్ఖత్వం అన్నారు. విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని పేర్కోన్నారు. నీట్ పేపర్ లీకేజీ చేసి విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సరైన దర్యాప్తు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు తీవ్రతం చేస్తామని హెచ్చరించారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల పై లాఠీ చార్జీ కి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కోరారు.

# విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఈనెల 23న రాజేశ్వరపురం లో జరిగే విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక (సిజీఆర్ఎఫ్) ను సద్వినియోగం చేసుకోవాలని నేలకొండపల్లి ఏఈ జి.రవి సూచించారు. మండల కేంద్రం లోని విద్యుత్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారం కోరకు నిర్వహించే సదస్సు లో వినియోగదారులు నేరుగా వారి సమస్యలను తెలియజేయవచ్చునని అన్నారు. గ్రామాలలో ఉన్న సామాహిక విద్యుత్ సమస్యలను కూడ ఫోరం దృష్టికి తీసుకవచ్చి తగిన పరిష్కారం పొందవచ్చునన్నారు. నేలకొండపల్లి, కూసుమంచి, తిరుమలాయపాలెం మండలాలలోని బచ్చోడు, కూసుమంచి, పాలేరు, రాజేశ్వరపురం, నేలకొండపల్లి సెక్షన్లలోని విద్యుత్ వినియోగదారులు, రైతులు పాల్గొనవచ్చునని పేర్కోన్నారు. గురువారం ఉదయం 10:30 మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం ను కొనసాగిస్తారని తెలిపారు. ఈ వేదిక కు సీజీఆర్ఎఫ్1 వరంగల్ చైర్ పర్సన్ జీ.నాగప్రసాద్ పాల్గొంటారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, విద్యుత్ వినియోగదారులు, ఈ అవకాశం ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# లంక మల్లారంలో హెల్త్ క్యాంప్



**ప్రజాపక్షం/మణుగూరు:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మణుగూరు పరిధిలో గల టిటిడబ్ల్యూ యూఆర్‌జెసి లంక మల్లారం లో సర్వేయికల్ కాన్సర్ రాకుండా హెచ్‌పివి వాక్సిన్ 1415 సం. బాలికలకు అందజేశారు. అనంతరం హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బిఎస్‌కె డాక్టర్ ఉమాదేవి, సూపర్ వైజర్స్ సత్తెమ్మ, స్వరూప రాణి, జానకి, రాంప్రసాద్, సుమ, రాధా తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ డిజిటలైజేషన్‌ను వేగవంతం చేయాలి




-జిల్లాలో 90 శాతం లక్ష్యాన్ని చేరుకోవాలి
-రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నిర్వహించిన వీసీలో పాల్గొన్న కలెక్టర్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మంజిల్లాలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమాన్ని వేగవంతం చేసి ఓటర్ల వివరాల డిజిటలైజేషన్‌ను నిర్దేశిత గడువు లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిపిస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి పి. సుదర్శన్‌రెడ్డి హైదరాబాద్ నుంచి జిల్లా ఎన్నికల అధికారులతో ఎస్ఐఆర్ కార్యక్రమ పురోగతి, ఓటర్ల వివరాల డిజిటలైజేషన్, ఎన్యూమరేషన్ ప్రక్రియ, ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లా అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. కలెక్టరేట్ నుండి కలెక్టర్ దివాకర టిపిస్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా కలెక్టర్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరిస్తూ ఖమ్మంజిల్లాలో 80 శాతం డిజిటలైజేషన్ పూర్తి అయిందని ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో 65 శాతం డిజిటలైజేషన్ జరిగిందన్నారు. జిల్లాలో శాశ్వతంగా, ఇతర ప్రాంతాలకు వెళ్లిన, మరణించిన ఓటర్ల సంఖ్య సుమారు 55వేలు (ఐదు శాతం) ఉండగా వాటిని కూడా పరిగణలోకి తీసుకుంటే 85 శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయినట్లేనని ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. సోమవారం ఒక్క రోజే జిల్లాలో 20వేల మంది ఓటర్ల వివరాలను డిజిటలైజేషన్ చేశామని తెలిపారు. రానున్న ఐదు రోజుల్లో 90 శాతం డిజిటలైజేషన్ లక్ష్యాన్ని చేరుకుంటామన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ ప్రతి బూత్ స్థాయి అధికారి లక్ష్యం మేరకు ఓటర్ల వివరాలను డిజిటలైజేషన్ చేసేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో డిజిటలైజేషన్ పనులపై దృష్టిసారించాలన్నారు. 50 శాతం కంటే తక్కువ పురోగతి ఉన్న పోలింగ్ స్టేషన్లను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలు నింపడంలో బిఎల్‌ఓలు ప్రజలకు సహకరించాలని ఎన్నికల సంఘం రూపొందించిన అవగాహన వీడియోలను ప్రజలకు విస్తృతంగా చేరవేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ, ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, ఎన్‌డిసి సదానందం, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు, డిటి అన్సారీ, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

# గర్భస్థ లింగ నిర్ధారణపై ఉక్కుపాదం

-పిసిపిఎన్‌డిటి చట్టం ఖచ్చితంగా అమలు చేయాలి
-డీఎంహెచ్‌వో డాక్టర్ డి రామారావు




**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం:** గర్భస్థ శిశువు లింగ నిర్ధారణను పూర్తిగా అరికట్టి, ఆడశిశువు రక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి రామారావు పిలుపునిచ్చారు. జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయంలో ఆయన అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయి ప్రీ కాన్సెప్షన్ అండ్ ప్రీ నాటల్ డయాగ్నోసిస్ టెక్నిక్స్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో చట్టం అమలు, స్కానింగ్ కేంద్రాల పనితీరు, ఫామ్ ఎఫ్ రికార్డుల నిర్వహణ, తనిఖీలు తదితర అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ చేయడం, చేయించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లఘించే స్కానింగ్ కేంద్రాలు, వైద్యులు, సంబంధిత వ్యక్తులపై ఎలాంటి ఉపేక్ష లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలోని అన్ని నమోదిత అల్ట్రాసౌండ్ కేంద్రాలు ఫామ్ ఎఫ్ రికార్డులను పూర్తిస్థాయిలో నిర్వహించడంతో పాటు చట్టంలోని నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ ద్వారా క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి, ఉల్లంఘనలకు పాల్పడే కేంద్రాలపై చర్యలు కొనసాగిస్తామని తెలిపారు. గత సమావేశం అనంతరం ఏప్రిల్ 1 నుంచి ఇప్పటి వరకు 13 కొత్త రిజిస్ట్రేషన్ దరఖాస్తులు, 5 రెన్యువల్ దరఖాస్తులు, అలాగే 13 సవరణల దరఖాస్తులు అందించినట్లు వెల్లడించారు. ఆడబిడ్డ పట్ల వివక్షకు సమాజంలో తావులేకుండా ప్రతి కుటుంబం బాలికను గౌరవించాలని కోరిన ఆయన "బేటీ బచావో..బేటీ పడావో" లక్ష్యాల సాధనకు అన్ని శాఖలు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సభ్యులు, ఐఎంఏ ప్రతినిధులు, మహిళా, శిశు సంక్షేమ అధికారులు, రేడియాలజిస్టులు, గైనకాలజిస్టులు, న్యాయనిపుణులు, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

# బంజారాల పవిత్ర ప్రకృతి పండుగ శ్రీసీత్లా భవానీ ఉత్సవాలు




-బంజారా సంస్కృతికి ప్రతీక సీత్లా భవానీ పండుగ
-ఐటీడీఏ పీవో రాహుల్



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బంజారాల పవిత్ర ప్రకృతి ఆరాధన పండుగ శ్రీ సీత్లా భవానీ పండుగ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బూర్గంపాడు మండలం అంజనాపురం గ్రామ శివారులో జరిగిన వేడుకల్లో భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ పాల్గొని బంజారా సంప్రదాయాల ప్రకారం ప్రత్యేక పూజాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో రాహుల్ మాట్లాడుతూ సీత్లా భవానీ పండుగ బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ప్రకృతిని దైవంగా భావించి పూజించడం గిరిజన సంస్కృతిలో గొప్ప విశిష్టత అని పేర్కొన్నారు. తండాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలు, పశువులకు ఆరోగ్యం కలగాలని సీత్లా భవానీ అమ్మవారిని ప్రార్థిస్తూ బంజారా సమాజం ఈ పండుగను తరతరాలుగా నిర్వహిస్తోందన్నారు. అంజనాపురం గ్రామ బంజారా ప్రజలు ఐటీడీఏ పీవో రాహుల్‌కు సంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ బానోత్ నరసింహారావు, ఉప సర్పంచ్ భూక్య విజయలక్ష్మీ, బంజారా పెద్దలు, గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 24న కోటమైసమ్మ తల్లి జాతర దుకాణాలకు వేలం



**ప్రజాపక్షం/కారేపల్లి:** ఇల్లందు ఏరియాలో ప్రసిద్ది గాంచిన ఉసిరికాయలపల్లి కోటమైసమ్మతల్లి జాతర ఏర్పాట్లకు దేవాదాయ శాఖ అధికారులు సన్నద్ధమవుతున్నారు. దసరా సందర్భంగా ఐదు రోజుల పాటు జరిగే జాతరలో ఆలయ ప్రాంగణంలో 11 రోజుల పాటు దుకాణాల ఏర్పాటుకు ఈనెల 24న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కటుకూరి వెంకటయ్య, వ్యవస్థాపక ధర్మకర్త డాక్టర్ పర్సా పట్టాభి రామారావు తెలిపారు. కొబ్బరికాయలు, పూజా సామగ్రి, లడ్డూ, పులిహోరా, పుట్నాలు, పేలాలు, కొబ్బరి చిప్పలు, మిఠాయి, ఐస్‌క్రీమ్ దుకాణాల హక్కులకు వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నిర్ణీత డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని, అధిక పాటదారులకు హక్కులు కేటాయిస్తామని తెలిపారు.

# అభివృద్ధిని అడ్డుకోవడమే బిఆర్ఎస్ లక్ష్యం




**ప్రజాపక్షం/మధిర :** మధిర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పారుపల్లి విజయ్‌కుమార్ మాట్లాడుతూ మధిరలో జరుగుతున్న అభివృద్ధి పనులను అడ్డుకోవడమే బిఆర్ఎస్ పార్టీ లక్ష్యంగా పెట్టుకుందని, అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. వైరా నది రిటైనింగ్ వాలు పనులు సాంకేతిక నిపుణుల సూచనల మేరకే జరుగుతున్నాయని తెలిపారు. ప్రతి చిన్న అభివృద్ధి పనిని కూడా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కని లక్ష్యంగా చేసుకొని విమర్శించడం బిఆర్ఎస్ నాయకులు కమల్‌రాజుకు అలవాటుగా మారిందని విమర్శించారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో మధిర అభిఋద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు చూసి ఓర్వలేక ప్రతి పనిలోను అడ్డంకులు సృష్టిస్తూ చౌకబారు రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పాతర్ల మండల అధ్యక్షులు పారుపల్లి విజయకుమార్, జిల్లా కాంగ్రెస్ నాయకులు వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తలుపుల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# చెరువు కాపాలాదారులను బెదిరించినందుకు ముగ్గురుపై కేసు నమోదు

**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** చెరువు కాపాలాదారులను చంపుతామని బెదిరించిన కేసులో ముగ్గురు పై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. చెరువుమాధారం మత్స్యపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు మహ్మద్ ఖాసీం తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలం లోని చెరువుమాధారం చెరువు కు కాపాలాదారులు గా ఉంటున్న బొడ్డయ్య, మస్తాన్, సైదులు, వీరయ్య అనే వారిని చెరువుమాధారం గ్రామానికి చెందిన వై. సైదులు, ఆర్.మధార్, చిన్నతండా కు చెందిన కే.శ్రీను లు అర్ధరాత్రి చెరువు కట్ట వద్ద కు వెళ్లి..కాపాలాదారులను చంపుతామని బెదిరించారు. చెరువు పై కాపాలా ఉండటానికి వీలు లేదని హెచ్చరించారు. చెరువులో వలలు లేకుండా చేస్తామని, వలలను కోస్తామని హెచ్చరించారు. అసభ్యకరంగా తిడుతూ, కాపాలాదారులను భయపెట్టారని, అంతే కాకుండా చెరువులోని చేపలను లూటీ చేసేందుకు గ్రామస్తులను ప్రోత్సాహిస్తున్నారని సొసైటీ చైర్మన్ ఖాసిం స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్థానిక ఎస్సై పి.శ్రీనివాసరెడ్డి ముగ్గురు పై కేసు నమోదు చేశారు.

# ఆ కుటుంబాన్ని వదలని మృత్యుఛాయలు..

-నాడు అన్న, నేడు తమ్ముడు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఆ కుటుంబాన్ని మృత్యువు శాపమై వెంటాడుతోంది. ఎనిమిదేళ్ల క్రితం అన్నను పొట్టనబెట్టుకున్న ఘోర కలికమే, నేడు తమ్ముడి ప్రాణాలను కూడా తీసేసింది. బోదులబండ గ్రామానికి చెందిన అనంత కుటుంబంలో వరుసగా చోటుచేసుకున్న ఈ ప్రమాదాలు స్థానికులను తీవ్రంగా కలచివేస్తున్నాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం సాయంత్రం పొలంలో గడ్డి కోస్తుండగా అనంత వీరయ్య (54) ప్రమాదవశాత్తు కరెంటు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందిన సంగతి తెలిసిందే. అయితే ఈ కుటుంబంలో ఎనిమిది సంవత్సరాల క్రితం కూడా ఇలాంటి ఘోర విషాదమే చోటుచేసుకుంది. వీరయ్య స్వయానా సొంత అన్న అయిన అనంతు వెంకన్న 8 ఏళ్ల క్రితం ఇంట్లో బావి పని చేస్తుండగా ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయాడు. అప్పట్లో అన్న వెంకన్న అకాల మరణంతో పెద్ద దిక్కును కోల్పోయిన ఆ కుటుంబం, ఇప్పుడు కష్టపడి పనిచేసే తమ్ముడు వీరయ్యను కూడా విద్యుత్ ఘాతంలో కోల్పోవడాన్ని జీర్ణించుకోలేకపోతోంది. ఒకే కుటుంబంలో అన్నదమ్ములిద్దరూ వేర్వేరు ప్రమాదాల్లో అకాల మరణం చెందడంతో బోదులబండ గ్రామంలో తీవ్ర శోకసంద్రం నెలకొంది. కష్టపడి బతికే కుటుంబంపై కాలం పగబట్టిందని స్థానికులు కన్నీటిపర్యంతమవుతున్నారు.

# విద్యార్థులపై లాఠీచార్జిని తీవ్రంగా ఖండిస్తున్నాం

వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్



**ప్రజాపక్షం/వైరా:** ఢిల్లీలో విద్యార్థులు, యువత చేపట్టిన శాంతియుత నిరసనపై పోలీసులు లాఠీ చార్జి చేయడం, టియర్ గ్యాస్ ప్రయోగించడం, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ తీవ్రంగా ఖండించారు. విద్యా వ్యవస్థలో నెలకొన్న అవకతవకలు, నీట్, జేఈఈ పరీక్షల పేపర్ లీకేజీలు తదితర అంశాలపై పార్లమెంట్‌కు ర్యాలీగా వెళుతున్న విద్యార్థులు యువతపై ఢిల్లీ పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి రోడ్డుపై ఈడ్చుకుంటూ విచక్షణారహితంగా లాఠీచార్జి చేయడం, టియర్ గ్యాస్ ప్రయోగించడం దారుణమని ఆయన పేర్కొన్నారు. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విద్యార్థుల భవిష్యత్తును కాపాడాల్సింది పోయి వారి గొంతును అణిచివేసే విధంగా వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. విద్యా వ్యవస్థలో జరిగిన వైఫల్యాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశ చరిత్రలో ఈ ఘటన ఒక చీకటి రోజుగా నిలిచిపోతుందని పేర్కొన్న కట్ల సంతోష్, విద్యార్థులపై నమోదు చేసిన కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ఈ ఘటనపై సుప్రీంకోర్టు పర్యాన న్యాయమూర్తి సుమోటోగా స్వీకరించిన సమగ్ర నివేదిక తెప్పించి విద్యార్థుల హక్కుల ఉల్లంఘనకు బాధ్యులైన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థులు తమ హక్కుల కోసం శాంతియుతంగా నిరసన తెలిపే రాజ్యాంగబద్ధ హక్కును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, బలప్రయోగంతో ఉద్యమాలను అణచివేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని కట్ల సంతోష్ పేర్కొన్నారు.